బీజేపీ ఎంపీలున్న చోట మంత్రులేరి?

- రాష్ట్రంలో ఆరు లోక్‌సభ నియోజకవర్గాల్లో విచిత్ర పరిస్థితి
- కాంగ్రెస్, బీజేపీ అవగాహనలో భాగమేనంటున్న ప్రజలు
- ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్‌కు మొండిచేయి
- క్యాబినెట్ కూర్పుపై విస్మయం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నిజామాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర మంత్రివర్గ కూర్పుపై రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ నడుస్తున్నది. బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్లమెంటరీ నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మంత్రివర్గంలో చోటు దక్కకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో మొత్తం 17 ఎంపీ స్థానాలు ఉండగా.. కాంగ్రెస్ నుంచి ఎనిమిది మంది ఎంపీలు, బీజేపీ నుంచి ఎనిమిది మంది, ఎంఐఎం నుంచి ఒకరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మహబూబ్‌నగర్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల నుంచి బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. ఇందులో మహబూబ్‌నగర్, కరీంనగర్ ఎంపీ స్థానాల పరిధిలోని వారికి మాత్రమే మంత్రి పదవులు దక్కాయి. వీరిలో సీఎం రేవంత్ ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గంతోపాటు, కొత్తగా మంత్రి పదవి పొందిన వాకిటి శ్రీహరి నియోజకవర్గం మక్తల్ కూడా మహబూబ్‌నగర్ ఎంపీ స్థానం పరిధిలో ఉన్నాయి. పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ కరీంనగర్ ఎంపీ స్థానం పరిధిలో ఉన్నది. ఇక మిగిలిన బీజేపీ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాల పరిధిలో ఏ ఒక్క కాంగ్రెస్ ఎమ్మెల్యేకు గానీ, ఎమ్మెల్సీ కిగాని మంత్రి పదవి దక్కకపోవడం గమనార్హం. బీజేపీ, కాంగ్రెస్ మధ్య కొనసాగుతున్న లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కాంగ్రెస్ పార్టీ కావాలనే మంత్రులను నియమించలేదన్న అభిప్రాయం సోషల్ మీడియాలో వ్యక్తమవుతున్నది. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో పరస్పర సహకారంతో విజయాలు సాధించిన ఫలితంగానే ఈ మేరకు సర్దుబాట్లు ఏమైనా జరిగియా? అనే కోణంలో చర్చ నడుస్తున్నది. బీజేపీ ఎంపీలుగా పోటీచేసిన వారు తమ గెలుపు కోసం కాంగ్రెస్ నేతలతో చేతులు కలపడం, కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా పోటీచేసిన వారంతా బీజేపీ ఎంపీ అభ్యర్థులకు సహకరించడం వంటి కారణాలు ఇందులో ఇమిడి ఉన్నాయనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. గవర్నర్ బండారు దత్తాత్రేయ పుస్తకావిష్కరణ సభలో మోదీ స్కూల్‌లో, చంద్రబాబు కాలేజీలో చదువుకుని రాహుల్‌గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నానంటూ రేవంత్ చేసిన నర్మగర్భ వ్యాఖ్యలు ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయని కాంగ్రెస్, బీజేపీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

కనిపించని భౌగోళిక సమతుల్యం

రేవంత్ క్యాబినెట్‌లో ఉత్తర తెలంగాణ ప్రాంతం తీవ్ర వివక్షకు గురవుతున్నది. 2023లో కొలువుదీరిన ప్రభుత్వంలో నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల నుంచి ఏ ఒక్కరికీ మంత్రి పదవి దక్కలేదు. 18 నెలల తర్వాత చేపట్టిన మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్‌కు స్థానం దక్కింది. ఈసారి కూడా నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాలకు మొండిచేయి తప్పలేదు. ఇన్‌చార్జి మంత్రుల మీదనే ఆధారపడటంతో ఎమ్మెల్యేలకు సఖ్యత కొరవడి పాలనా వ్యవహారాలు కుంటుపడుతున్నాయనే విమర్శలున్నాయి. మంత్రివర్గ విస్తరణలో భౌగోళిక సమతుల్యం దెబ్బతిన్నట్టు అర్థమవుతున్నది. గతంలో ఉమ్మడి జిల్లా ప్రాతిపాదికన మంత్రులకు ప్రాతినిధ్యం ఉండేది. ప్రస్తుతం ఉమ్మడి నిజామాబాద్‌లో కాంగ్రెస్ నుంచి నలుగురు ఎమ్మెల్యేలున్నప్పటికీ ఒక్కరికీ మంత్రి పదవి దక్కలేదు. హైదరాబాద్, రంగారెడ్డి ఉమ్మడి జిల్లాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అత్యధిక మంది ఉన్నారు. అరకొరగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలున్నప్పటికీ కాంగ్రెస్ వారిని విస్మరించింది. కనీసం ప్రభుత్వ విప్ వంటి పోస్టులు కూడా దక్కలేదు. మంత్రివర్గంలో రాజధానిలోని నాయకులకు చోటు దక్కకపోవడం చరిత్రలో ఇదే ప్రథమమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మూడు జిల్లాలకు క్యాబినెట్‌లో అసలు ప్రాతినిధ్యమే లేకపోవడం, బీజేపీ ఎంపీలున్న ఆరు నియోజకవర్గాల్లో ఏ ఒక్కరికీ మంత్రి పదవులు దక్కకపోవడంపై కాంగ్రెస్ నేతలు సైతం విస్మయం వ్యక్తంచేస్తున్నారు.

చల్లారని అసంతృప్తి జ్వాల

రగిలిపోతున్న సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి • అధిష్ఠానం బుజ్జగించినా ప్రయోజనం శూన్యం

- అనుచరులతో రాజీనామాలు చేయిస్తున్న అసంతృప్త నేతలు
- అధిష్ఠానంపై ఒత్తిడి పెంచే యత్నం
- సుదర్శన్‌రెడ్డిని పక్కనపెట్టిన పార్టీకి పుట్టగతులుండవంటూ నేతల లేఖ
- మూకుమ్మడి రాజీనామాలకు బోధన్ నాయకుల నిర్ణయం

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో మంత్రివర్గ విస్తరణ అసంతృప్త జ్వాలలు ఇంకా చల్లారడం లేదు. మంత్రి పదవి ఆశించి భంగపడ్డ సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు కాంగ్రెస్ అధిష్ఠానంపై రగిలిపోతున్నారు. ఒకవైపు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ బుజ్జగించినా.. ప్రయోజనం కనిపించడం లేదు. నేతలు రాజీనామాల పట్టువీడటం లేదు. ఒకవైపు, కీలక నేతలు ఆగ్రహంతో ఊగిపోతుంటే.. వారి అనుచరులు మరింత రెచ్చిపోతున్నారు. ఇటు రాష్ట్ర పార్టీ నాయకత్వంపై, అటు అధిష్ఠానంపై మండిపడుతున్నారు. తమ నేతకు మంత్రి పదవి దక్కకపోవడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. బహిరంగంగానే పార్టీపై విమర్శలు చేస్తున్నారు. పార్టీ కోసం కష్టపడ్డ తమ నేతకు మంత్రి పదవి దక్కనప్పుడు ఇక పార్టీతో తమకేం సంబంధమని ప్రశ్నిస్తున్నారు. పార్టీ తమ సేవలను గుర్తించనప్పుడు... పార్టీకి తామెందుకు విదేయంగా ఉండాలని రగిలిపోతున్నారు.

మూకుమ్మడి రాజీనామాలు!

ఏడాదిన్నర తర్వాత ఆదివారం మంత్రివర్గ విస్తరణ జరిగిన విషయం తెలిసిందే. ఇందులో వాకిటి శ్రీహరి, గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్‌కు మంత్రి పదవి దక్కగా, ముందునుంచీ పోటీలో ఉన్న సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మొండిచేయి చూపించింది. మంత్రి పదవి దక్కనందుకు నిరసనగా తాము పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరికలు జారీచేశారు. దాదాపు రాజీనామా చేసినంత పనిచేశారు. అధిష్ఠానం హామీతో కొంత వేచి చూసే ధోరణిలోకి వెళ్లారు. కానీ, వారి అనుచరులు మాత్రం తగ్గడం లేదు. తమ నేతకు జరిగిన అన్యాయానికి నిరసనగా పార్టీకి మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఇప్పటికే బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి వర్గీయులు తమ పదవులకు మూకుమ్మడి రాజీనామా చేస్తూ పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌కు లేఖ రాశారు. తమ నేతకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు ఈ గడ్డపై పుట్టగతులు ఉండవని తీవ్రస్థాయిలో శాపనార్థాలు పెట్టారు. అంతటితో ఆగకుండా బోధన్ బంద్‌కు పిలుపునిచ్చి, అనివార్య కారణాలతో దానిని వాయిదా వేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి దక్కనందుకు నిరసనగా చండూరు మండల నేతలు పార్టీకి, పదవులకు మూకుమ్మడి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఇదే దారిలో ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి అనుచరులు కూడా వెళ్తున్నట్టు తెలిసింది. అనుచరులను రాజీనామాలకు పురికొల్పడం ద్వారా అధిష్ఠానంపై మరింత ఒత్తిడి పెంచొచ్చనే ఆలోచనలో భంగపాటు నేతలు ఉన్నట్టు సమాచారం. అందుకే ముందుగా అనుచరులతో రాజీనామాలు చేయించి, అప్పటికీ, అధిష్ఠానం నుంచి భరోసా దక్కకపోతే ఇక స్వయంగా తామే రాజీనామాలు చేసేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. ఈ విధంగా మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్‌లో మరో కొత్త కుంపటికి దారి తీసిందనే అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమవుతున్నది.

కాంగ్రెస్ భూస్థాపితమే

- మూకుమ్మడి రాజీనామాలు చేసిన బోధన్ కాంగ్రెస్ నేతలు
- పీసీసీ చీఫ్ లేకపోవడంతో ఇంటి వాచ్‌మన్‌కు రాజీనామా అందజేత

బోధన్, జూన్ 9: మంత్రివర్గ విస్తరణలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి చోటు దక్కకపోవడంతో ఆగ్రహించిన అనుచరులు పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు. వారంతా సోమవారం రాజీనామా పత్రాలతో హైదరాబాద్‌లోని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఇంటికి తరలివెళ్లారు. మహేశ్‌కుమార్ అప్పటికే ఢిల్లీకి వెళ్లడంతో రాజీనామా పత్రాలను ఆ ఇంటి వాచ్‌మన్‌కు ఇచ్చారు. ట్విట్టర్, వాట్సాప్ ద్వారా మహేశ్‌కుమార్‌గౌడ్‌కు రాజీనామా లేఖలను పోస్ట్‌చేశారు. అంతేకాకుండా రాజీనామా లేఖలను ట్విట్టర్, వాట్సాప్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, అధిష్ఠానం పెద్దలకు పంపారు. మరికొందరు నాయకులు పీసీసీ చీఫ్‌కు ఫోన్ చేసి అసంతృప్తి వెళ్లగక్కారు. జిల్లాలో కాంగ్రెస్‌కు గట్టి నాయకుడిగా ఉన్న సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకపోతే జిల్లాలో పార్టీని ఆదుకునే నాథుడే ఉండరని స్పష్టం చేశారు. స్థానిక ఎన్నికలు జరిగేలోపు సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని, లేకపోతే నిజామాబాద్ జిల్లాలో కాంగ్రెస్‌ను భూస్థాపితం చేస్తామని అల్టిమేటమ్ ఇచ్చారు. రాజీనామా చేసినవారిలో మండలాల అధ్యక్షులు గంగాశంకర్, పాషా మొయినుద్దీన్, మోబిన్‌ఖాన్, శ్రీనివాస్‌గౌడ్, డీ నాగేశ్వర్‌రావు, మందర్న రవి, పులి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ శంకర్, బోధన్ శివాలయం చైర్మన్ హరికాంత్‌చారి ఉన్నారు.

మల్‌రెడ్డిని బుజ్జగించిన శ్రీధర్‌బాబు

తుర్కయంజాల్, జూన్ 9: మంత్రివర్గ విస్తరణలో చోటుదక్కకపోవడంతో అసంతృప్తిగా ఉన్న ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుజ్జగించేందుకు ప్రయత్నించేరు. సోమవారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి తొర్రూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ.. మల్‌రెడ్డి రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడు అని, పదేండ్లపాటు అధికారంలో లేకపోయినా పార్టీని కాపాడారని, ఆయన ఆవేదనను పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తోపాటు ఇతర పార్టీ పెద్దలు మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి మాట్లాడారని వెల్లడించారు. ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరూ నిరుత్సాహానికి గురికాకూడదని సూచించారు.

మంత్రివర్గంలో లంబాడీలకు చోటేది?

- టీఎస్‌జీజీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): 'మంత్రివర్గంలో లంబాడీలకు చోటేది?.. ముఖ్యమంత్రికి మా వర్గం అంటే చిన్నచూపు ఎందుకు?' అని టీఎస్‌జీజీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్ ప్రశ్నించారు. మంత్రిపదవి ఇవ్వకుండా లంబాడీలను మోసం చేశారని సోమవారం ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. రాష్ట్ర జనాభాలో 10 శాతం లేని అగ్రవర్ణాలకు ఏడు మంత్రి పదవులు కేటాయించడం విడ్డూరమన్నారు. డిప్యూటీ స్పీకర్ పదవిని రాంచంద్రునాయక్‌కు ఇవ్వడం ఎందుకని ప్రశ్నించారు. ఆయన ఆ పదవిని తీసుకోవద్దని డిమాండ్ చేశారు. అడుగడుగునా అన్యాయం చేస్తున్న హస్తం పార్టీకి బుద్ధిచెప్పేందుకు భవిష్యత్‌లో 'కాంగ్రెస్ హఠావో-బంజారా బచావో' పేరిట ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

కాంగ్రెస్ హఠావో.. బంజారా బచావో

లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్

షాద్‌నగర్, జూన్ 9 : కాంగ్రెస్‌ను గద్దె దించితేనే బంజారాల బతుకులు మారతాయని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్‌నాయక్ పేర్కొన్నారు. మంత్రివర్గంలో లంబాడాలకు స్థానం కల్పించకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ .. సోమవారం కాంగ్రెస్, రేవంత్ హఠావో.. బంజారా బచావో అనే నినాదాన్ని ఇచ్చి మాట్లాడారు. బంజారా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు ఏమాత్రం పౌరుషం ఉన్నా వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడాలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకుండా సామాజిక న్యాయం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. లంబాడాలను కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని, తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఇందిరమ్మ ఇండ్లకు 98.64 కోట్లు విడుదల

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఇప్పటివరకు 388 ఇందిరమ్మ ఇండ్లకు స్లాబ్‌లు వేయగా, ప్రభుత్వం నుంచి లబ్ధిదారులకు రూ.98.64 కోట్లు విడుదల చేసినట్టు గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. 9,877 ఇండ్లకు పునాదులు పూర్తికాగా, 1,839 ఇండ్ల గోడల నిర్మాణం పూర్తయిందని ఆయన తెలిపారు. వారంవారం లబ్ధిదారులకు చెల్లింపుల్లో భాగంగా సోమవారం రూ. 22.64 కోట్లు విడుదల చేసిన ఆయన.. ఈ మేరకు ఇండ్ల నిర్మాణ పురోగతి వివరాలు వెల్లడించారు.

మహిళ లందరినీ ఎస్‌హెచ్‌జీల్లో చేర్పించాలి

- కలెక్టర్లను ఆదేశించిన మంత్రి సీతక్క

హైదరాబాద్ జూన్ 9 (నమస్తేతెలంగాణ): అర్హులైన మహిళలను స్వయం సహాయక సంఘాల్లో (ఎస్‌హెచ్‌జీ) చేర్పించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ఆమె వీడియా కాన్ఫరెన్స్ నిర్వహించారు. అక్టోబర్ 2 నాటికి మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయించాలని సూచించారు. 22 జిల్లాల్లో చేపట్టిన ఇందిరా మహిళా శక్తి భవనాలను పూర్తిచేయాలని కోరారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల నమోదును పెంచాలన్నారు.

బీజేపీ స్కూల్లో రేవంత్ డ్రాపౌట్ స్టూడెంట్

- బీజేపీ ఎంపీ లక్ష్మణ్

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ బీజేపీ స్కూల్లో డ్రాపౌట్ స్టూడెంట్‌గా దారి తప్పారని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ స్కూల్లో దేశం, జాతీయవాదం ఉంటాయని తెలిపారు. రాహుల్ కోరిక మేరకే కులగణన, రిజర్వేషన్లు, మంత్రివర్గ విస్తరణ చేశారని.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని రేవంత్‌రెడ్డి ఢిల్లీ నాయకులకు తాకట్టు పెట్టారని మండిపడ్డారు. ఏడాదిన్నర పాలనలో అవినీతి తప్ప కాంగ్రెస్ చేసిందేమీ లేదని ఫైర్ అయ్యారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుపై పారదర్శకంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సంపదను రేవంత్ ఢిల్లీకి మోస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి రాహుల్ గాంధీకి రాయబారా.. లేక తెలంగాణకు జవాబుదారా..? అని లక్ష్మణ్ ప్రశ్నించారు.

'కొబ్బరి' బోర్డు ఆఫీస్ ఏర్పాటు చేయాలి

- కేంద్ర మంత్రికి తుమ్మల వినతి

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. సోమవారం రాష్ట్ర పర్యటనలో భాగంగా విచ్చేసిన కేంద్ర మంత్రిని కలిసిన తుమ్మల ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఆయిల్‌పామ్ విత్తనాల సరఫరాదారుల ఎంప్యానల్‌మెంట్‌ని ఏర్పాటు చేయాలని, ఆయిల్‌పామ్ రైతులకు కనిష్ఠ మద్దతు ధర రూ.25వేలు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ వర్సిటీకి రూ.100 కోట్లు మంజూరు చేయాలన్నారు.

రైతు కమిషన్ చైర్మన్ భేటీ

వ్యవసాయానికి ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేయాలని, మైనర్ ఇరిగేషన్‌కు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. సోమవారం రాష్ట్ర పర్యటనలో ఉన్న శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో కోదండరెడ్డి సమావేశమయ్యారు.

రేవంత్‌రెడ్డి బీజేపీ పూర్వవిద్యార్థి!

- అవకాశం దొరికినప్పుడల్లా బీజేపీపై భక్తిచాటుకుంటున్న రేవంత్
- బడేభాయ్ మోదీ మాట నుంచి నేను మీ విద్యార్థినే అనే వరకు
- బీజేపీ, మోదీ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతున్న వైనం
- రేవంత్‌రెడ్డి, బీజేపీ బంధంపై కాంగ్రెస్ సీనియర్లలో సందేహాలు

హైదరాబాద్, జూన్ 9 (నమస్తే తెలంగాణ): "మోదీ స్కూలులో, చంద్రబాబు కాలేజీలో చదువుకున్నాను... రాహుల్‌గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నా" ఇదీ ఆదివారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు. బీజేపీ నేతలు, ఎన్డీయే కూటమిలోని భాగస్వామ్యపక్షాల నాయకులు పాల్గొన్న ఈ సభలో కాంగ్రెస్‌కు చెందిన ఓ ముఖ్యమంత్రి పాల్గొనడం, రేవంత్‌రెడ్డి ప్రవర్తించిన తీరు, మాట్లాడిన మాటలు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. ఈ సభకు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు ఒకప్పటి బీజేపీ నేతలు, ప్రస్తుత గవర్నర్లు ఇంద్రసేనారెడ్డి, కంభంపాటి హరిబాబు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఏపీ గవర్నర్ జస్టిస్ నజీర్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సహా వందల మంది బీజేపీ నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సభలో రేవంత్‌రెడ్డి వ్యవహారం చూసిన చాలా మంది ఇదేంటి అని ఆశ్చర్యపోతున్నారు. బీజేపీ నేతలను ఇంతలా ప్రసన్నం చేసుకోవడానికి పాకులాడటం వెనుక ఆంతర్యమేంటని చర్చించుకుంటున్నారు. సాధారణంగా మనం చదువుకుంటున్న స్కూలు గురించి, కాలేజీ గురించి గర్వంగా, ఘనంగా చెప్పుకుంటాం. అదే సమయంలో ఉద్యోగం ప్రస్తావన కొంత సందిగ్ధంగా ఉంటుంది. ఇక్కడ చేస్తున్నది ఉద్యోగం అని చెప్పడంతో.. ఇక్కడ కాకపోతే ఇంకోచోటైనా ఆ ఉద్యోగం చేస్తానననే ధ్వని పొంచి ఉంటుంది. అలాగే రాహుల్‌గాంధీ దగ్గర 'ఉద్యోగం' చేస్తున్న అని బీజేపీ వేదికపై చెప్పడం ద్వారా నేను మీ మనిషినే, అవసరార్థం అక్కడ ఉన్న అనే సందేశం బీజేపీ నేతలకు ఇచ్చినట్టుగా కనిపిస్తున్నదని, ప్రస్తుత ఉద్యోగం ఎప్పుడైనా మానేయవచ్చనే సంకేతం కాంగ్రెస్ పెద్దలకు పంపినట్టే కనిపిస్తున్నదని కాంగ్రెస్ సీనియర్‌నేత ఒకరు విశ్లేషించారు.

బీజేపీ పెద్దల ప్రసన్నం కోసం!

దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌పార్టీ అగ్రనేత, ఆ పార్టీ పార్లమెంటరీ నేత రాహుల్‌గాంధీ బీజేపీపై విరుచుకుపడుతుంటే ఆశ్చర్యకరంగా ఇక్కడ కాంగ్రెస్ పార్టీకే చెందిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం బీజేపీని ప్రసన్నం చేసుకునేందుకు తహతహలాడటం గమనార్హం. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాటి నుంచే బీజేపీ పాట, పల్లవి అందుకున్నారు. రాష్ట్రానికి ప్రధాని మోదీ వచ్చినపుడు "గుజరాత్ మాడల్‌లో తెలంగాణలో అభివృద్ధి జరగాలి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారం కావాలి" అని నిరుడు ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన ప్రధాన మంత్రి ఎదుట రేవంత్‌రెడ్డి పొగిడారు. ఇదే సభలో మోదీని బడేభాయ్ అని సంబోధించారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన శాసనసభ సమావేశాల్లో బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తనకు మంచి ఫ్రెండ్ అని మాట్లాడారు. బీజేపీకి చెందిన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తమ పార్టీ నేతలు భేటీలు జరుపుతారంటూ సంచలన కామెంట్స్ చేశారు. ఇదంతా ఇలా ఉంటే కేంద్రమంత్రులు ఎవ్వరు వచ్చినా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమయం ఇచ్చి మరీ కలుస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసమైతే ఫర్వాలేదు. కానీ, ఇన్ని భేటీల తర్వాత కూడా రాష్ట్రానికి కేంద్రం నుంచి ఒక్కటంటే ఒక్క ప్యాకేజీ, నిధులు రాలేదు. కేంద్రం నుంచి తెలంగాణకు ప్రయోజనకరంగా ఉన్న ఒక్క పని కూడా జరగలేదు. పనులు జరగకపోయినా.. నిధులు రాకపోయినా ముఖ్యమంత్రి కొందరు కేంద్ర మంత్రులు రాష్ట్ర పర్యటనకు వస్తే స్వయంగా వెళ్లి స్వాగతం పలుకుతుంటారు. పార్లమెంటు ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి స్వయంగా అనేక ఇంటర్వ్యూల్లో తాను గెలిచేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంత సహకరించారో చెప్పారు.

నీతి ఆయోగ్‌కు ఎందుకు వెళ్లిన్నట్టు?

నీతి ఆయోగ్ సమావేశాలకు తాను వెళ్లబోనని గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. వాస్తవానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా నీతి ఆయోగ్ సమావేశాలకు రావడంలేదు. ఇవన్నీ ఏకపక్షంగా ఉంటున్నాయన్నది వారి వాదన. అయితే విచిత్రంగా రేవంత్‌రెడ్డి గత నెలలో జరిగిన నీతి ఆయోగ్ సమావేశానికి వెళ్లారు. ఆ సమావేశానికి కర్ణాటకలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్య వెళ్లలేదు. వెళ్లినవాడు కనీసం కాంగ్రెస్ ఏజెండాలోని ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఇది రాజకీయంగా పెనుసంచలనం అయింది. ప్రధాన మంత్రి మోదీ, బీజేపీ, ఎన్డీయే పక్షాల పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో రోజంతా రేవంత్‌రెడ్డి గడపటం బీజేపీతో రేవంత్ అల్లుకుంటున్న బంధానికి నిదర్శనమని సాక్షాత్తు కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నేతలే వ్యాఖ్యానిస్తున్నారు.

బీజేపీ నేతలు ఎందుకు మాట్లాడటం లేదు?

రాష్ట్రంలోని బీజేపీ ముఖ్యనేతలెవ్వరూ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు, సీఎం రేవంత్‌రెడ్డిపై పెద్దగా ఏమీ మాట్లాడడంలేదు. ప్రభుత్వ తీరును, పాలనాలోపాలను ఎండగట్టకపోగా మద్దతుగా చాలా స్టేట్‌మెంట్లు ఇచ్చారు. రఘునందన్‌రావు, కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, బండి సంజయ్, ధర్మపురి అరవింద్.. ఇలా ఎంపీలందరూ రేవంత్‌రెడ్డితో సయోధ్యతో ఉంటున్నారని విమర్శలున్నాయి. దీనికి తగ్గట్టుగానే వారి వ్యవహారశైలి కూడా కనిపిస్తున్నది. గడిచిన 18 నెలల్లో కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్.. రేవంత్‌రెడ్డి